
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5



కొత్తపల్లి మండలం ఎక్కమేడ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం

డిసెంబరు 2027 నాటికి ఎస్‌ఎల్‌బీసీ పూర్తి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- పదేళ్లపాటు జిల్లా ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది
- జగన్‌తో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం కారణంగానే రెండు జిల్లాలకు అన్యాయం
- నాలుగు రోజుల్లో సర్వే నివేదిక
- మన్నెవారిపల్లిలో విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి


ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఔట్ లెట్ సర్వే ప్రారంభించేందుకు హెలికాప్టర్‌లో వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండేళ్లల్లో శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ టన్నెల్ (ఎస్‌ఎల్‌బీసీ) పనులను పూర్తి చేసి రైతులు, ప్రజల పట్ల తమ నిబద్ధతతను నిరూపించుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లిలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఔట్ లెట్ నుంచి సోమవారం చేపట్టిన హెలిబార్న్ ఎలక్ట్రోమాగ్నటిక్ జియోఫిజికల్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పాలమూరు, నల్గొండ జిల్లాలకు సాగునీటి విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రధానంగా తెరమీదకు తీసుకొచ్చి తెలంగాణ ఉద్యమాన్ని నడిపి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్ల కాలంలో ఈ రెండు జిల్లాలకు ఒరుగబెట్టిందేమి లేదన్నారు. అంతేకాకుండా కృష్ణానది జలాల విషయంలో ఆంధ్రా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌తో లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకుని రైతాంగాన్ని నిండా ముంచారన్నారు. కృష్ణా జలాల విషయంలో సింహభాగం ఆంధ్రాకు దక్కేలా చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్ముడుపోయిందన్నారు. కృష్ణానది జలాల్లో దాదాపు 500 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం పాలమూరు, నల్గొండ జిల్లాలకు ఉన్నప్పటికీ అప్పట్లో సీఎంగా ఉన్న కేసీఆర్ ప్రేక్షక పాత్ర పోషించాడని విమర్శించారు. దీంతో పాలమూరు- రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగా

(మిగతా 6వ పేజీలో..)


పట్టుపడ్డ గంజాయి కాటన్లు, సెల్‌ఫోన్లు, నగదు

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 12.4 కిలోల నిషేధిత గంజాయి పట్టివేత
- పది మంది, రెండు బైకులు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం
- సోలాపూర్ నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ వినీత్

6

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో.. ఐదుగురికి తీవ్ర గాయాలు

7

బక్కచిక్కుతున్న బాల్యం

నారాయణపేట జిల్లాలో తక్కువ బరువు ఉన్న 4,987 మంది చిన్నారులు

- 1,368 మంది చిన్నారులకు తీవ్ర పోషకాహార లోపం
- ఉడకని భోజనం అందజేత
- అరకొరగా బాలామృతం పంపిణీ

కోస్గి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం అందక బాల్యం బక్కచిక్కుతోంది. నారాయణపేట జిల్లా పరిధిలోని 13 మండలాల్లో చిన్నారులు తీవ్ర పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 704 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 41,311 మంది చిన్నారులు ఉన్నారు. 4,987 మంది చిన్నారులు తక్కువ బరువు ఉండగా, 1,019 మంది చిన్నారులు అతి తక్కువ బరువు ఉన్నారు. 1,368 మంది చిన్నారులు తీవ్ర పోషకాహార లోపంతో, 121 మంది చిన్నారులు అతి తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు ప్రతీ మూడు నెలలకోసారి మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సర్వేలో తేలింది.

పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార ప్రాధాన్యంపై కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. కోడి గుడ్లు ఇతర సరకులు పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ పెంచుతాం. అతి తీవ్ర పోషకాహార లోపాలున్న వారికి అదనంగా పౌష్టికాహారం అందిస్తున్నాం.

- వెంకటేశ్వరమ్మ, ఇన్‌చార్జి సీడీపీవో, మద్దూర్ సెక్టార్

అందని పౌష్టికాహారం

మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు బాలామృతం, నెలకు 16 కోడి గుడ్లు ఇవ్వాలి. 3 నుంచి 6 ఏళ్లలోపు వారికి రోజూ భోజనం, నెలకు 30 కోడి గుడ్లను ఇవ్వాల్సి ఉండగా మండలంలో నామమాత్రంగా అమలవుతోంది. కొన్ని చోట్ల ఉడకని అన్నం పెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. బాలామృతం 18 నెలల్లోపు వారికి రోజుకు 15 గ్రాములు, మూడేళ్ల లోపు 30 గ్రాములు, ఐదేళ్లలోపు వారికి 45 గ్రాములు ఇవ్వాల్సి ఉండగా ఆ మేర ఇవ్వడం లేదని తెలుస్తోంది. పోషకాహారంతో బాధపడుతున్న వారికి బాలామృతం ప్లస్ పంపిణీ చేయాల్సి ఉండగా, చాలా కేంద్రాలు పట్టించుకోవడం లేదు.


మాట్లాడుతున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

న్యాయశాఖలో విస్తృత అవకాశాలు

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్య విశ్వజనసీయమైనదని, న్యాయశాఖలో విద్యార్థులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీయూలోని పరిపాలన భవనంలో న్యాయశాస్త్ర విద్యార్థులకు నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయశాస్త్రంలో సామాజిక, చట్టపరమైన ఆదరణ పుష్కలంగా ఉంటుందన్నారు. విద్యార్థులు న్యాయశాస్త్రంలో మంచి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. వ్యవస్థపై లోతైన అవగాహన కలిగిఉంటే భవిష్యత్‌లో ఉత్తమ న్యాయాధికారులుగా, న్యాయవాదులుగా రాణించి గుర్తింపును తెచ్చుకుంటారని అన్నారు.అంతకు ముందు జిల్లా ఉచిత న్యాయసేవ అధికారి డి.ఇందిర మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ల ద్వారా కేసులను ఉచితంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, న్యాయ కళాశాల డీన్ వెంటేశ్వర్లులతో కలిసి వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ ప్రవీణ, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూధన్ రెడ్డి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాలవి, ఎంఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణార్ రెడ్డి, ఫార్మసి ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు

నిర్మాణం ప్రారంభించని వారిని రద్దు చేయండి


ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

- ఎమ్మెల్యేలతో మాట్లాడి వారి స్థానంలో కొత్తగా ప్రతిపాదనలు పంపండి
- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టని లబ్ధిదారులను రద్దు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేలతో మాట్లాడి, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించి వారి స్థానంలో కొత్తగా ప్రతిపాదనలు పంపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

అంతకు ముందు ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అధికారులకు కేటాయించిన సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలలను ప్రతీనెల మొదటి వారంలో తనిఖీ చేసి, అప్‌లోడ్ చేయాలని సూచించారు. వానాకాలం పంట కొనుగోలుకు ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రారంభించాలన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 73 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారంలో జాప్యం చేయొద్దని, వినతులు నమోదు చేయడం కాకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో నర్సింహులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని వినతి


ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఎదిర 4వ వార్డు వాసులు

ఎదిర 4వ వార్డులో హనుమాన్ దేవాలయం సమీపంలో గల కొత్త కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మిషన్‌భగీరథ పైప్‌లైన్ వేయాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నూరిబాబు, బాను, బాలకిష్టమ్మ, మంగమ్మ, లక్ష్మీ, సునీత, మహేష్, రమేష్ ఉన్నారు.

చిరువ్యాపారులకు భరోసా

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- గుర్తింపు కార్డులు పంపిణీ


చిరు వ్యాపారికి గుర్తింపు కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా పాలమూరు నగరంలో వీధి వ్యాపారులకు తైబజార్ బాధ లేకుండా రద్దు చేసి, భరోసా ఇచ్చామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నగరంలోని టీడీగుట్టలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్య బీమా చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, పిల్లలను అక్కడే చదివించాలన్నారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. డబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తామని మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రి, ఎన్‌పీ వెంకటేశ్, పెద్దవిజయకుమార్, గోనెల శ్రీనివాస్, చిన్న, ఉమర్, మునీర్, చందు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

నగరంతోపాటు రూరల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తొలగించండి

- రెగ్యులేటరీ కమిషన్ ఆవిర్భావ దినోత్సవంలో ఫిర్యాదుల స్వీకరణ


అధికారులకు సమస్య చెబుతున్న వినియోగదారుడు లక్ష్మయ్య

పాలమూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని బోయపల్లి శివారులో ఉన్న తమ పొలం సాగు చేయడానికి విద్యుత్ వైర్లు అడ్డుగా ఉన్నాయని, వాటిని తొలగించాలని వినియోగదారుడు లక్ష్మయ్య విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. లక్ష్మయ్య సమస్య విన్న టీజీ ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ పి.వెంకటరమేష్ తొందరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినియోగదారుల నుంచి 17 ఫిర్యాదులు స్వీకరించినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసిన వారికి రశీదు ఇచ్చామని, సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్థులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

దామరగిద్ద, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం ముస్తాపేట్‌లో హనుమాన్ దేవాలయం ముందు సోమవారం ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠాపన, ఆలయంపై శిఖరం స్థాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు ఇంటి ఆడపడుచులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాధవరెడ్డి, పుట్టి ఈదప్ప, బీజేపీ నాయకులు సత్తి సత్యనారాయణ, అంజప్ప, చాపలి శ్రీనివాస్, నిర్వాహకులు రంగయగౌడ్, నరేందర్‌గౌడ్, అంజిలయ్యగౌడ్, విఠల్ గౌడ్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.


ఊట్కూర్‌లో రైతులతో మాట్లాడుతున్న పోలీసు

ఎకరానికి 7 క్వింటాళ్లే కొనుగోలు

- పరిమితిని కుదిస్తూ సీసీఐ నిర్ణయం
- జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులు ఆందోళన
- ఊట్కూరు మండలం విజయ్ కాటన్ ఇండస్ట్రీస్ ముందు రాస్తారోకో

7


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

'కురుమూర్తి' హుండీ లెక్కింపు

- రూ. 28.70 లక్షల ఆదాయం
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- స్టాళ్ల వద్ద కొనుగోలుదారుల సందడి

7

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 120.00
హోల్ సేల్	: 129.00
డ్రెస్డ్	: 203.00
స్కిన్ లెస్	: 231.00

ఉత్సాహంగా రగ్బీ జట్ల ఎంపిక

6

డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి స్పందన

- నారాయణపేట ఎస్పీ వినీత్
- మొత్తం ఫిర్యాదులు 17
- భూ తగాదాలవే అధికం


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

నారాయణపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణ పేట ఎస్పీ డాక్టర్ వినీత్ సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఎస్పీ డాక్టర్ వినీత్ చెప్పారు. 17 మంది ఫోన్ ద్వారా సమస్యలు తెలుపడంతో పాటు సలహాలు, సూచనలు అందించారన్నారు. వచ్చిన కాల్స్‌లో ఎక్కువగా భూ తగాదాలకు సంబంధించినవి ఉన్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు, రాత్రిపూట పెట్రోలింగ్ పెంచాలని, గంజాయిపై ఉక్కు పాదం మోపాలని, ఆరుబయట మద్యం తాగడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదులను చట్ట ప్రకారం తప్పకుండా పరిష్కరిస్తామని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులకు సమస్యలను తెలిపారు. వాటిని దర్యాప్తు చేసి, పరిష్కరించి, ఎస్పీ కార్యాలయానికి రిపోర్టు పంపాలని ఆదేశించారు. ఏవైన సమస్యలుంటే జిల్లా ప్రజలు నేరుగా పోలీసు అధికారులను సంప్రదించాలన్నారు.

చేతికొచ్చిన పంట నీటి పాలు

- వనపర్తి పట్టణంలో భారీ వర్షం
- తడిసిపోయిన ధాన్యం, మొక్కజొన్న



మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన మొక్కజొన్న



అకాల వర్షానికి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న మహిళ

వనపర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి చేతికొచ్చిన పంట నీటి పాలయ్యింది. మార్కెట్ యార్డులో రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం, మొక్కజొన్న రాశులు తడిసిపోయాయి. చేతికి వచ్చిన పంట కళ్ల ముందు తడిసిపోతుండటంతో కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా రగ్బీ జట్ల ఎంపిక



ఉమ్మడి జిల్లా రగ్బీ జట్టుతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-17 బాల, బాలికల రగ్బీ జట్లను ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహబూబాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తుది జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. టోర్నీలో ప్రతిభ చాటి విజేతలు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌గౌడ్, వేణుగోపాల్, పరశురాం, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు నిరంజన్‌రావు పాల్గొన్నారు.

జూపల్లిలో ఘనంగా సదర్ సమ్మేళనం



సదర్ సమ్మేళనంలో పాల్గొన్న యాదవులు

చారకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన దున్నపోతులను అలంకరించిన యాదవ సంఘం నాయకులు, యువకులు పెద్ద ఎత్తున భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. డప్పు మేళాల నడుమ డీజే సౌండ్లతో గ్రామంలోని పుర వీధుల గుండా ఆట పాటలతో ఊరేగించారు. ప్రధాన కూడలిలో దున్నపోతులతో ప్రదర్శన నిర్వహించారు. సదర్‌కు వచ్చిన అతిథులను ఘనంగా సన్మానించారు. యాదవ సంఘం నాయకులు బిక్షపతి, శ్రీను, సత్యం, వెంకటేష్, రాజు, లింగం, గిరి, కాశీ, మహేష్, గెల్వయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సత్యనారాయణస్వామి వ్రతాలు

కందనూలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల సీతారామచంద్రస్వామి దేవాలయంలో కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 10:30గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు రామాలయ ప్రధాన అర్చకుడు కందాడై వరద రాజన్ అయ్యంగార్ తెలిపారు. శ్రీవీర వెంకటసత్యనారాయణ స్వామి వ్రతాలు సామూహికంగా ప్రత్యేకంగా బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆకలితో చదువు సాగేదెలా?

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- సాయంత్రం వేళ అల్పాహారం అందక అవస్థలు



ఉత్తనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ప్రత్యేక తరగతి

అయిజ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆకలితో బాధపడుతూ చదువుకోవడం కష్టంగా ఉందని 10వ తరగతి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులోనే ప్రత్యేక తరగతులను ప్రారంభించింది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని 85 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 4,200 మంది పదవ తరగతి విద్యార్థులున్నారు. వారందరూ ఆయా పాఠశాలల్లో ప్రతీ రోజు సాయంత్రం 4-30 గంటల నుంచి 5-30 గంటల నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు.

ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండటంతో ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 5-30 గంటల వరకు పాఠశాలలోనే ఉండాల్సి వస్తోంది. వారు తిరిగి గ్రామాలకు చేరుకొనే సరికి రాత్రి 8 గంటలు దాటుతోంది. ఉదయం 7 గంటల సమయంలో ఇంటి దగ్గర టిఫిన్ చేసి వచ్చిన విద్యార్థులు రాత్రి వరకు ఉండాలంటే కష్టం అవుతోంది. ఒక్కోసారి ఇంటి వద్ద వంట కాకపోతే తినకుండానే రావాల్సి వస్తోంది. తిరిగి వెళ్లేందుకు బస్సులు సమయానికి రాకపోయినా, ప్రైవేట్ వాహనాలు అందుబాటులో లేకపోయినా మరింత ఇబ్బంది పడాల్సి వస్తోంది. సమీప గ్రామాల విద్యార్థులు కొందరు సైకిళ్లపై బడికి వస్తున్నారు. సాయంత్రం వేళ ఆకలితో బాధపడుతూ సైకిల్ తొక్కాలంటే కష్టంగా ఉంటుందని చెప్తున్నారు.

ఆదేశాలు వస్తే అమలు చేస్తాం



ప్రత్యేక తరగతులకు హాజరయ్యే 10 వ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించాలని ఇప్పటి వరకు ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. నిధులు రాకపోవడం వల్లే అమలు చేయడం లేదు. ప్రభుత్వం నుంచి త్వరలో ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది.

- విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి

అల్పాహారం అందించాలి

గతంలో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించే వారు. ఈ ఏడాది ఇప్పటి వరకు అందుకు అవసరమైన చర్యలు చేపట్టలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఆకలితోనే చదువుకోవాల్సి వస్తోంది. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఈనెల మొదటి నుంచి అల్పాహారం అందిస్తామని ప్రజాప్రతినిధులు గత నెలలోనే ప్రకటించారు. వారు ఇచ్చిన హామీ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

డిసెంబరు 2027 నాటికి ఎస్‌ఎల్‌బీసీ పూర్తి

(5వ పేజీ తరువాయి..)

మిగిలిపోయావని, ఈ కారణంగా కృష్ణానది జలాల వాటా విషయంలో ఆంధ్రాకు తమ వాదనలు సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్‌లో వినిపించే వెసులుబాటు కలిగిందన్నారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నారు. నల్గొండ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసుకోవడానికి ఇంతకంటే మంచి తరుణం దొరకదు. ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకునే శక్తుల పట్ల ఐక్యంగా ఉద్యమించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్‌ఎల్‌బీసీ నిర్మాణాన్ని 2027 డిసెంబరు నాటికి పూర్తి చేసి నల్గొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో 30లక్షల మందికి రక్షిత తాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ఆయన చెప్పారు.



టన్నెల్ వద్దకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నాలుగు రోజుల్లో సర్వే నివేదిక..

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనులను 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో అధునాతనమైన హెలీబార్న్ ఎలక్ట్రోమాగ్నటిక్ జియోఫిజికల్ సర్వేకు క్యాబినెట్‌లో ఆమోదం తెలిపింది. ఎస్‌ఎల్‌బీసీ రిస్క్యూ ఆపరేషన్‌లో కీలక భూమిక నిర్వహించిన కల్నల్ పరిషత్ మోహారాను డిప్యూటేషన్‌పై తెలంగాణకు తీసుకొచ్చింది. ప్రపంచంలోనే అత్యంత పొడవైన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కెనడాకు చెందిన హెలీబార్న్ ఎలక్ట్రోమాగ్నటిక్ టెక్నాలజీ దోహదపడనుంది. హెలికాప్టర్ ద్వారా నిర్వహించే ఈ సర్వే భూమి అంతర్భాగంలో 30 నుంచి వెయ్యి మీటర్లలోపు ఉన్న పరిస్థితిని ప్రతీ 200మీటర్లకు సంబంధించిన నివేదికను సూక్ష్మస్థాయిలో అందిస్తోంది. దోమలపెంట నుంచి మన్నెవారిపల్లి వరకు పూర్తి కావాల్సిన మరో 9.8కిలో మీటర్ల టన్నెల్ తవ్వకానికి సంబంధించి ఎదురయ్యే భౌగోళిక పరిస్థితులన్నింటినీ ఈ సర్వే పరిష్కార మార్గాన్ని చూయించనుంది. ఎస్‌ఎల్‌బీసీ ఇన్‌లెట్‌లో ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఈ నేపథ్యంలో తిరిగి పనులు పునఃప్రారంభిస్తే ప్రాణ నష్టం జరగకుండా ఆచితూచి అడుగు వేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. బ్లాస్టింగ్, డ్రిల్లింగ్ విధానంలో మిగతా టన్నెల్ తవ్వకాలు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దోమలపెంట ఇన్‌లెట్‌లో జరిగిన ప్రమాదంలో టన్నెల్ బోరింగ్ మిషన్ పూర్తిగా ధ్వంసం కావడంతో బ్లాస్టింగ్ విధానం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండాపోయింది. అయితే పర్యావరణానికి హానీ కలుగకుండా కచ్చితంగా బ్లాస్టింగ్, డ్రిల్లింగ్ విధానంలో ఎస్‌ఎల్‌బీసీని పూర్తి చేసేందుకు ప్రపంచంలో టన్నెల్ నిర్మాణ రంగానికి సంబంధించిన సంస్థలన్నీ నివేదిక సమర్పించడంతో రాష్ట్ర ప్రభుత్వం ధైర్యంగా పనుల పునఃప్రారంభానికి అడుగులు వేసింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పర్యావరణానికి ఎలాంటి హానీ కలగకుండా ఉండాలనే క్రమంలో హెలీబార్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే వైపు మొగ్గు చూపింది.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 12.4 కిలోల నిషేధిత గంజాయి పట్టివేత
- పదిమంది, రెండు బైకులు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం
- సోలాపూర్ నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ వినీత్



నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్, చిత్రంలో పట్టుబడ్డ గంజాయి అంతర్రాష్ట్ర ముఠా

నారాయణపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలలో నిషేధిత గంజాయిని సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు పది మందిని చాకచక్యంగా నారాయణపేట జిల్లా పోలీసులు పట్టుకున్నారు. సోమవారం నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వినీత్ వివరాలను వెల్లడించారు. జిల్లాలోని కృష్ణ ఎస్‌ఐ నవీద్ తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం కున్సి చెక్‌పోస్టు దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు బైకులపై అనుమానాస్పదంగా ఐదుగురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. దీంతో వారిని వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించగా నారాయణపేటకు చెందిన ముగ్గురు యువకులు అజర్ అలీ, సుఫియాన్, కనిగిరి విశాల్ ఉన్నారు. వారు వచ్చిన హోండా షైన్ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారు గతంలో నారాయణపేట పరిసర ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్ల అమ్మకానికి ప్రయత్నించారన్నారు. కర్ణాటకలోని యాదిగిరికి చెందిన ఉమేష్ లల్లన్‌రామ్ కూడా తమ బైక్ పై వచ్చి సైదాపూర్ వద్ద కలుసుకున్నారన్నారు. ఇక్కడ యాదగిరికి చెందిన సోనియా అనే మహిళ వద్ద సుమారు రెండు కిలోల గంజాయి తీసుకున్నారన్నారు. వారి తిరిగి వస్తుండగా కున్సి చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారని తెలిపారు. సోనియా విచారణలో గంజాయిని నారాయణపేట యువకులు పంపించినట్లు వెల్లడించిందని, రెండు బైకులు, 2.15 కేజీల గంజాయి, పదివేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. అనంతరం నిందితుల సమాచారం మేరకు ముంబై నుంచి వస్తున్న ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో పెద్దమొత్తంలో గంజాయి వస్తుందని తెలిసి కృష్ణా రైల్వే స్టేషన్‌లో ఎస్‌ఐ నవీద్ బృందం మాటు వేసి ఆదివారం రాత్రి 7.45 గంటలకు మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన తుకారం, సమీర్, ఏక్‌నాథ్, అక్షయ, దత్త్రేయ, యాదిగిర్‌కు చెందిన సోనియా, సమీర్ సయ్యద్‌లను పట్టుకొని పదికిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సోలాపూర్‌కు చెందిన నితిన్ అనే వ్యక్తి ఈ గంజాయి అందజేశారన్నారు.

ప్రస్తుతం నితిన్ పరారీలో ఉన్నాడని, అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని నియమించినట్లు తెలిపారు. రెండేళ్లుగా అంతర్రాష్ట్ర ముఠాగా ఏర్పడి గంజాయి ప్యాకెట్లు అక్రమంగా రవాణా చేస్తున్న మొత్తం పది మందిని అరెస్టు చేసి వారి నుంచి 12.4 కేజీల గంజాయి, రెండు బైకులు, పది సెల్‌ఫోన్లు, పదివేల నగదు, స్వాధీనం చేసుకొని కృష్ణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందుతులను సోమవారం రిమాండ్‌కు పంపించామన్నారు.

గంజాయి ముఠాను పట్టుకున్న డీఎస్పీ లింగయ్య, మక్తల్ సీఐ రామ్‌లాల్, కృష్ణ ఎస్‌ఐ నవీద్, టస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ పురుషోత్తం, పోలీసు సిబ్బంది గోప్యానాయక్, రాఘవేందర్‌గౌడ్, రామస్వామి, అశోక్ కుమార్, శ్రీకాంత్, అశోక్, బానుప్రసాద్, శంకరమ్మలను ఎస్పీ అభినందించారు.

ఫిర్యాదుదారుల వివరాలు గోప్యం

- జడ్చర్ల ఎస్‌ఐ మల్లేశ్



జడ్చర్లలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ మల్లేష్

జడ్చర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏ విషయంపై అయినా ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని జడ్చర్ల ఎస్‌ఐ మల్లేశ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని ఆర్‌కే గార్డెన్స్‌లో సోమవారం పోలీసుశాఖ, షీ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

కాలనీల్లో అనుమానాస్పదంగా కనిపించిన వారిపై, ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, విషయం తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. మహిళలపై అనుచితంగా వ్యవహరించేవారిపై కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని, బాలలను పనిలో పెట్టుకోకూడదని, ఈవ్ టీజింగ్‌కు పాల్పడవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రావణి, షీటీమ్ ఏఎస్‌ఐ జయరాణి, కానిస్టేబుల్ చందర్, ఏహెచ్‌టీయూ ఎస్‌ఐ సుజాత, పోలీసు కళాబృందం సభ్యులు రాములు, జగదీశ్ పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఓపెన్ స్కూల్ తరగతులు

- టాస్ రాష్ట్ర పరిశీలకురాలు అనురాధ



గద్వాలలోని అధ్యయన కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్ పరిశీలకురాలు అనురాధ

గద్వాల సర్కిల్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూళ్లలో ప్రణాళిక ప్రకారం అభ్యర్థులకు తప్పనిసరిగా తరగతులు నిర్వహించాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) రాష్ట్ర పరిశీలకురాలు అనురాధ సూచించారు. గద్వాల పట్టణంలోని పలు ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను సోమవారం జిల్లా కో-ఆర్డినేటర్ సునీతమ్మతో కలిసి పరిశీలించారు.

అడ్మిషన్ల ప్రక్రియ, పుస్తకాల సరఫరా, ఆదివారం తరగతుల నిర్వహణ, పర్సనల్ కాంటాక్ట్ ప్రోగ్రాం (పీసీపీ) తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ నర్సింగరావును కలిసి టాస్ నిర్వహణ అంశాలను వివరించారు. కార్యక్రమంలో టాస్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ శివయ్య, అధ్యయన కేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దామోదర కల్యాణం



ప్రత్యేక అలంకరణలో రాధ, కార్తీకదామోదర స్వామి

కోయిలకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం రాధా కార్తీక దామోదర కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉసిరి, తులసి చెట్లకు భక్తిశ్రద్ధలతో కల్యాణం చేశారు.

కార్తీకమాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు రమాచారి, సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటకు సాగునీరు లేనట్లేనా?

- అయోమయంలో ఆర్డీఎస్ రైతులు
- టీబీ డ్యాం గేటు మరమ్మతు కాక కష్టాలు
- కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందన కరువు




ఆర్డీఎస్ కాలువలో పారుతున్న నీరు

వడ్డేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భారీగా వర్షాలు కురిసి సమృద్ధిగా నీరు అందుబాటులో ఉన్నా ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో రబీ పంటల సాగుకు వీలు లేకుండా పోయింది. దీనిపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. గత ఏడాది ఆగస్టులో టీబీ డ్యాం 19వ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కాగా, ప్రస్తుతం డ్యామ్‌లో 80 టీఎంసీల నీరు ఉండటంతో, ఆయకట్టు రైతులు రబీలో సాగునీటిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే డ్యామ్ గేటు మార్పు పనులతో రెండవ పంటకు నీరు అందుబాటులో ఉండే పరిస్థితులు కనిపించడం లేదని ఇంజనీర్లు చెప్తున్నారు. ఈ విషయంపై రైతులు జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌కు 15 రోజుల క్రితం వినతిపత్రం ఇచ్చారు.

కానీ ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల్లో క్రాప్ హాలిడే ఇచ్చినట్లు సమాచారం. కనీసం అధికారులైనా స్పందించి సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కాగా, రబీలో సాగు నీరు ఇవ్వబోమని ఖరీఫ్ సీజన్‌కు ముందే టీబీడ్యాం బోర్డు ప్రకటించింది. అయితే వర్షాలు కురుస్తుండటంతో డ్యామ్‌లో నీరు పుష్కలంగా ఉంది. గేట్లు సక్రమంగా లేకపోవడంతో నీటి నిల్వను వంద టీఎంసీల నుంచి 80 టీఎంసీలకు తగ్గించినట్లు కర్ణాటక అధికారులు చెప్తున్నారు. ఇంకా వరదలు కొనసాగుతుండటంతో గేటు మరమ్మతుకు వీలు ఉండటం లేదు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

తక్షణం నిర్ణయం తీసుకోవాలి



జిల్లా కలెక్టర్‌కు 15 రోజుల క్రితం వినతిపత్రం ఇచ్చాం. ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు తక్షణ మే నిర్ణయం తీసుకోవాలి. స్పష్టత ఇస్తే ప్రత్యామ్నాక పంటలను సాగు చేసుకుంటాం. ప్రస్తుత భారీ వర్షాలతో ఖరీఫ్ పంటలు బాగా దెబ్బతిన్నాయి.

- నాగరాజు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

సీడ్ జొన్న వేశాను



ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట వర్షాల వల్ల పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో పంటను తొలగించి రబీ సాగుకు సిద్ధమయ్యాను. టీబీ డ్యామ్‌లో పుష్కలంగా నీరుందని, ఆర్డీఎస్ నుంచి సాగునీరు వస్తుందన్న నమ్మకంతో 4 ఎకరాల్లో సీడ్ జొన్న వేశాను. అయితే నీటి విడుదలపై అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా ఇవ్వలేదు.

- గోపాల్, రైతు

క్రైం కార్నర్

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసగా మారి, మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మకూరు ఎస్‌ఐ జయన్న, మృతుడి కుమారుడు అంకె నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంకె నాగన్న (48) భార్య అంకె పద్మ ఎనిమిది సంవత్సరాల క్రితం మృతి చెందింది. వారి కుమారుడు అంకె నరేశ్ బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. అప్పటి నుంచి గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న నాగన్న మద్యానికి బానిసయ్యాడు. మతిస్థిమితం కోల్పోయి గత నెల 29న రాత్రి ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టుపక్కల వారు ఆదివారం తలుపులు బద్దలు గొట్టి చూడగా, నాగన్న మృతదేహం కనిపించింది. దీంతో కుమారుడు నరేశ్‌కు ఫోన్ చేసి విషయం తెలపడంతో ఇంటికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


బాబు (ఫైల్)

గోపాల్‌పేట, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండల కేంద్రంలోని హనుమాండ్లగడ్డ కాలనీకి చెందిన ఎంగళపల్లి వెంకటయ్య, అంజనమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కొడుకు బాబు (30) గ్రామంలోనే చిన్నచిన్న పనులు జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులందరూ నిద్ర పోతుండగా, బాబు స్విచ్ ఆఫ్ చేసేందుకు వెళ్లి, ప్రమాదావశాత్తు విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేక వేస్తూ, గోడకు గుద్దుకొని పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు లేచి చూడగా, అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ కన్నుమూత

కోస్గి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడిన మహిళ, చికిత్స పొందుతూ మృతి చెందింది. కోస్గి ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, కోస్గికి చెందిన గుండ్రాళ్ల సునీత (37) గత నెల 28న వంటగదిలో పాలు కాస్తుండగా, ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకున్నది. గమనించిన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఈనెల 2న మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి ఘటనలో నిందితుడి అరెస్టు

జడ్చర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై వేడి ఛాయ్ పోసి దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని పర్హని హోటల్‌లో శనివారం రాత్రి సమీర్ అనే వ్యక్తి ఛాయ్ తాగేందుకు వెళ్లాడు. పాతకక్షల నేపథ్యంలో హోటల్ యజమాని మహ్మద్ అతడిపై వేడి ఛాయ్ పోసి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడు మహ్మద్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వాగులోకి దూసుకెళ్లిన వాహనం


అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన బొలెరో వాహనం

దామరగిద్ద, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో జరిగింది. మహారాష్ట్రకు చెందిన వాహనం సోమవారం తెల్లవారు జామున వేగంగా వెళ్తూ అదుపుతప్పి ఎల్లమ్మకుంటలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల సహాయంతో వాహనాన్ని వాగులోనుంచి బయటకు తీశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు

మాగనూరు/కోస్గి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మాగనూరు ఎస్‌ఐ అశోక్‌బాబు, కోస్గి ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, యాద్గిర్ జిల్లా, సైదాపూర్ తాలుకాలోని దుప్పల్లికి చెందిన సిగ్సూర్ ఆశమ్మ(42), సిగ్సూర్ హన్మంతు (45), సిగ్సూర్ శంకరప్ప (28), మంజునాథ్(4)లు ఒకే ద్విచక్రవాహనంపై మాగనూరు మండలంలోని టైరోడ్డు మీదుగా స్వగ్రామానికి బయలు దేరారు. దారిలో హైదరాబాద్ -1 డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొన్నది. దీంతో హన్మంతు, ఆశమ్మ, మంజునాథ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగ్రాతులను రాయచూరు ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

● నారాయణపేట జిల్లా, మద్దూర్ మండలంలోని పొర్లకుంట తండాకు చెందిన విస్లావత్ ప్రకాశ్ సోమవారం ఉదయం కోస్గికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో పాశం అనిల్ అనే వ్యక్తితో కలిసి బైక్‌పై వెళ్తుండగా, ఉర్దూ షాదీఖానా వద్ద వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొన్నది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన మద్దూర్ మండలంలోని మోమినాపూర్ గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ విష్ణుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పత్తి లారీ బోల్తా, తప్పిన ప్రమాదం


బోల్తా పడిన పత్తి లారీ

తెలకపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో పత్తి లారీ బోల్తా పడింది. దీనికి సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన లారీ మండల పరిధిలోని నడిగడ్డలో సోమవారం పత్తి నింపుకొని తెలకపల్లికి వచ్చింది. టైరు పంక్చర్ కావడంతో లారీ కింద జాకీ పెట్టి రిపేరు చేస్తుండగా, మెత్తటి మట్టి ఉండటం వల్ల జారి బోల్తా పడింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

సోమశిలకు ప్రత్యేక బస్సులు

కొల్లాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో లలితాంబిక సోమేశ్వరం పుణ్యక్షేత్రానికి కొల్లాపూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఉమా శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 6:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు నిరంతరం బస్సులు నడుపుతున్నట్లు వారు తెలిపారు.


తాడూరులోని ఓంకార్ కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద నిలిపి ఉన్న పత్తి లోడ్‌తో వచ్చిన వాహనాలు


తాడూరులో జిన్నింగ్ మిల్లు యాజమానితో మాట్లాడుతున్న రైతులు


తర్నికల్ సమీపంలోని మిల్లు ముందు జాతీయ రహదారిపై పత్తికి నిప్పు పెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

ఎకరానికి 7 క్వింటాళ్లే కొనుగోలు

» పరిమితిని కుదిస్తూ సీసీఐ నిర్ణయం

» జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులు ఆందోళన


ఉండవల్లి వద్ద 44వ నెంబరు జాతీయరహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పత్తి రైతులు

తాడూరు/ ఊట్కూరు/ అలంపూర్ చౌరస్తా/ మహబూబ్‌నగర్ రూరల్/ కల్వకుర్తి / నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విత్తనాల కొనుగోలు నుంచి విక్రయాల వరకు పత్తి రైతులకు కష్టాలు తప్పడం లేదు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసేవారు. తాజాగా ఆ పరిమితిని 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సీసీఐ గత నెల 27వ తేదీ నుంచి పత్తి కొనుగోలును ప్రారంభించింది. మూడు రోజుల పాటు పత్తి కొనుగోలు చేశారు. ఆ తర్వాత శని, ఆదివారాల్లో సీసీఐ పత్తి కొనుగోలు ప్రక్రియను ఆపింది. తిరిగి సోమవారం కొనుగోళ్లు జరుగుతాయని పత్తి రైతులు మిల్లుల వద్ద వాహనాలతో వేచి ఉన్నారు. కానీ సీసీఐ అధికారులు ఆన్‌లైన్‌లో యాప్‌ను ఓపెన్ చేయగా, కొనుగోలు పరిమితిని ఎకరానికి 12 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు కుదించినట్లు సమాచారం వచ్చింది. దీంతో ఒక్కసారిగా సీసీఐ అధికారులు, మిల్లు యాజమానులతో పాటు, పత్తి రైతులు అవాక్కయ్యే పరిస్థితి నెలకొంది.

జిన్నింగ్ మిల్లుల వద్ద ఆందోళనలు

పత్తి కొనుగోలు పరిమితిని కుదించడంతో రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద ఆందోళనలు చేపట్టారు. తాడూరులోని ఓంకార్ కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద శని, ఆదివారాలు సెలవులు కావడంతో రైతులు పత్తిలోడ్ తో తెచ్చిన వాహనాలను అక్కడే పెట్టుకొని ఎదురు చూశారు. తీరా సోమవారం ఎకరానికి 7 క్వింటాళ్లే కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు చెప్పడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తాము కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు స్పష్టం చేశారు. దీంతో రైతులు మిల్లు యజమానితో మాట్లాడి, సమస్యను వివరించారు. సమస్య పరిష్కారానికి కొంత సమయం పడుతుందని చెప్పారు.

● నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని తిప్రాస్‌పల్లి సమీపంలోని విజయ్ కాటన్ ఇండస్ట్రీస్ ముందు మక్తల్ రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. ఏపీవో శ్రీనివాసులును నిలదీశారు. వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఊట్కూరు ఎస్‌ఐ రమేశ్ అక్కడికి చేరుకొని వారికి నచ్చచెప్పినా ఫలితం లేకపోయింది. ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. దీంతో నారాయణపేట మార్కెట్ కమిటీ కార్యదర్శి భారతి, ఏవో గణేశ్‌రెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సీసీఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అధికారులు 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రం సమీపంలోని వరసిద్ధి వినాయక కాటన్‌మిల్లు ఎదుట జాతీయ రహదారిపై పత్తి రైతులు రాస్తారోకో చేపట్టారు. దీంతో ఇరువైపులా వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోయి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మార్కెట్ కార్యదర్శి ఎల్లస్వామి కలెక్టరుకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి కమిషనర్ వరకు విషయం చేరడంతో పరిమితిని పెంచుతూ మౌఖిక అదేశాలిచ్చినట్లు అలంపూరు సీఐ రవిబాబు రైతులకు తెలిపారు. దీంతో వారు అందోళన విరమించారు.

● మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని అప్పాయిపల్లి శివారులోని బాలాజీ ఇండస్ట్రీ మిల్లు ముందు, రాయిచూర్ రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. మిల్లుకు తీసుకొచ్చిన పత్తి వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలపడంతో దాదాపు గంట పాటు రాకపోకలు స్తంభించాయి. దీంతో అధికారులు అక్కడికి చేరుకొని సముదాయించడంతో రైతులను ఆందోళన విరమించారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలం, తర్నికల్ సమీపంలోని పత్తిమిల్లు సీసీఐ కొనుగోలు కేంద్రం ముందు జాతీయ రహదారిపై పత్తి రైతులు రాస్తారోకో చేపట్టారు. కొందరు రైతులు పత్తికి నిప్పు పెట్టి నిరసన తెలిపారు. దీంతో ఇరువైపులా వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. రాకపోకలకు ఆటంకం కలుగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అనంతరం రైతులు ఆందోళన విరమించారు.

సమష్టి పోరుతో సమస్యల పరిష్కారం

» టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కే సూర్యం


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం, వేదికపై జిల్లా నాయకులు

అమరచింత, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు సమష్టి పోరాటాలతో సమస్యలను పరిష్కరించుకోవచ్చని, హక్కులను సాధించుకోవచ్చని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కే సూర్యం అన్నారు. వనపర్తి జిల్లా, అమరచింతలోని మార్క్స్ భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మహారాష్ట్ర లోని పూణె పట్టణంలో ఈ నెల 20 నుంచి నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ ఆటోమేటివ్ వర్కర్స్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రామిక ఏకతా మహాసంగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాసభల్లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు హనుమంతు, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షులు సిరాజు, కురుమన్న, కే ప్రేమరత్నం, మస్తమని, భక్తరాజు తదితరలు పాల్గొన్నారు.

'కురుమూర్తి' హుండీ లెక్కింపు

» రూ. 28.70 లక్షల ఆదాయం


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామి వారి మొదటి హుండీని సోమవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో అధికారుల సమక్షంలో హుండీలో నుంచి నగదు తీసి లెక్కించగా, రూ.28,70,536 వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ప్రత్యేకాధికారి రఘునాథ్, కురుమూర్తి వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు భారతమ్మ, గోపాల్, రాములు, ఉంద్యాల శేఖర్, భాస్కరాచారి, నాగరాజు, కమలాకర్, బాదం వెంకటేశ్వర్లు, చక్రవర్ధన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నెల్లి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, అనంత విజయ్, లక్ష్మీ నరసింహ, సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. జాతర మైదానంలోని స్టాళ్ల వద్ద కొనుగోలుదారుల సందడి కొనసాగుతోంది.

ఉమామహేశ్వరంలో కార్తీక శోభ

» ప్రత్యేక వ్రతాలు ఆచరించిన భక్తులు

» పార్వతీ పరమేశ్వరులకు పల్లకీ సేవ


ఈశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

అచ్చంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండవ సోమవారం కావడంతో భక్తులు ఎకువజామునుంచే ఉమామహేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్దఎత్తున కార్తీక దీపాలను వెలిగించి నీలకంఠుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో ప్ర త్యేక వ్రతాలను చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల పల్లకీ సేవను పాపనాశిని నుంచి ఆలయం వరకు ఉన్న మాఢవీధులలో బాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లే కుండా ఆలయ కమిటీ ఛైర్మన్ భీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావుతో పాటు ఆలయ సిబ్బంది ధర్మకర్తలి మండలి సభ్యులు పవన్, వినోద్‌లు ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లా మండల కేంద్రానికి చెందిన సుదర్శన్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రాగణంలో 30 మంది అయ్యప్ప మాలలు ధరించారు. దాదాపు 1000 మంది భక్తలకు అన్నదాన ప్రసాదం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ అధ్యక్షుడు లక్ష దీపోత్సవాన్ని వెలిగించారు. అర్చకులు వీరయ్య, రవికుమార్, సిబ్బంది లక్ష్మణ్, కవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు 7 ఏళ్ల జైలు

» రూ.2,500 జరిమానా

» జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు


నిందితుడు హరికృష్ణ

గద్వాల క్రైం, నవంబరు 3 (ఆంధజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధించి, భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు 7 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్. ప్రేమలత తీర్పు వెల్లడించారు. కేసు వివరాలను ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం వెల్లడించారు. కర్నూలుకు చెందిన మల్లికకు, అలంపూర్ మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన చాకలి హరికృష్ణతో 2022, మార్చి 27న వివాహమైంది. వారికి ఒక కుమారుడు ఉన్నారు. వివాహం సమయంలో అత్తింటి వారు 10 తులాల బంగారం ఇచ్చారు. అయినా పెళ్లి అయిన మూడు నెలల నుంచే అదనపు కట్నం కోసం మల్లికకు వేధింపులు మొదలయ్యాయి. 2 తులాల బంగారం, రూ. 5 లక్షలు తీసుకొని రావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని మల్లిక తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో 2023, మే 12న సింగవరం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అప్పుడు మల్లికను మంచిగా చూసుకుంటానని అల్లుడు హామీ ఇవ్వడంతో ఆమెను అక్కడే వదిలి తల్లిదండ్రులు వెళ్లిపోయారు. అదే నెల 20వ తేదీన హరికృష్ణ అత్తగారింటికి వచ్చి, మీ కుమార్తె నిప్పంటించుకున్నదని చెప్పాడు. ఆమె తల్లి జూపల్లి జ్యోతిని బైక్‌పై ఎక్కించుకొని సంగవరం గ్రామానికి వెళ్తుండగా, తాండ్రపాడు వద్ద ఎదురొచ్చిన అంబులెన్స్‌లో కాలిన గాయాలతో ఉన్న మల్లిక కనిపించింది.

ఆమెతో మాట్లాడగా, ప్రతీ నిత్యం కట్నం కోసం గొడవ పడుతున్నాడని చెప్పింది. నేను పనినుంచి వచ్చే లోపు నీవు చచ్చిపోవాలని కొట్టాడని, అందుకే ఒంటికి నిప్పంటించుకున్నానని చెప్పింది. అనంతరం ఆమెను కర్నూల్ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదేరోజు మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పటి డీఎస్పీ రంగస్వామి విచారణ పూర్తి చేసి, కోర్టులో చార్జిషీటు వేశారు. డీఎస్పీ మొగిలయ్య పర్యవేక్షణలో, అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్‌ఐ వెంకటస్వామి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడు హరికృష్ణపై నేరం రుజువైనందున 7 సంవత్సరాల జైలుశిక్ష, రూ. 2500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్. ప్రేమలత తీర్పు ఇచ్చారు. పకడ్బందీ విచారణ నిర్వహించి నేరస్థుడికి శిక్ష పడేలా చేసిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగ అభినందించారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

» ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ శారదాబాయి


జాతీయస్థాయి అర్చరీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో రాణించి, పతకాలు సాధించాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ శారదాబాయి అన్నారు. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-14 బాల, బాలికల అర్చరీ టోర్నీకి జిల్లా క్రీడాకారులు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికావుతున్నారని అన్నారు. జాతీయస్థాయి పోటీలకు బాలికల విభాగంలో సమీక్ష, శ్రీవాణి, బాలుర విభాగంలో మణీశ్వర్, రుద్విక్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, మోగులాల్, కోచ్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఏషియన్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


మల్లికార్జున్


అమర్‌నాథ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏషియన్ మాస్టర్ అథ్లెటిక్స్ టోర్నీకి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు మల్లికార్జున్, అమర్‌నాథ్ ఎంపికయ్యారు. వారు గత మే నెలలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నయ్‌లో సోమవారం నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఏషియన్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం వారిని ఎస్పీ డి.జానకి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టోనీ మార్టిన్, శరత్‌చంద్ర అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

నారాయణపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా, పిల్లిగుండు తండా నుంచి లింగంపల్లికి అశోక్, సంతోష్ అనే వ్యక్తులు సోమవారం రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులు పోలీసులు పట్టుకున్నారు. అలాగే సత్తయ్య అనే వ్యక్తి బొమ్మన్‌పాడు నుంచి కోటకొండకు ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నారాయణపేట రూరల్ ఎస్‌ఐ రాముడు తెలిపారు.

ఇంటర్వ్యూ..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు వేగవంతం

» ఎంపీడీవో గీతాంజలి



మిడ్జిల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా నిర్మించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో గీతాంజలి తెలిపారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి దశాల వారీగా నిర్మాణాలను బట్టి బిల్లులను మంజూరు చేస్తున్నట్లు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎంపీడీవో వెల్లడించారు.

మండలంలో ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి?

మండలంలో మొదటి విడతలో 374 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైయ్యాయి.

ఇప్పటి వరకు మార్కింగ్ ఇచ్చిన ఇళ్లు ఎన్ని?

మండలంలోని ఇప్పటి వరకు 291 ఇళ్లకు మార్కింగ్ ఇవ్వడం జరిగింది.

బెస్‌మెంట్‌లెవల్‌లో ఉన్న ఇళ్లు ఎన్ని?

మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ఇప్పటి వరకు 231 బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి.

రూఫ్‌లెవల్, చివరి దశకు వచ్చిన ఇళ్లు ఎన్ని?

ఇప్పటి వరకు రూఫ్‌లెవల్ 104, చివరి దశకు వచ్చినవి 22 ఉన్నాయి. 104 ఇళ్లకు బిల్లులు ఇవ్వడం జరిగింది.

మండలంలోని పూర్తి స్థాయిలో ఎన్ని ఇళ్లు నిర్మించారు?

మండలంలోని కంచనపల్లి గ్రామంలోని ఒక లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం వారం రోజుల్లో పూర్తి దశకు చేరుకుంటుంది.

న్యూస్ బాక్స్

డిప్యుటేషన్లు రద్దు చేయాలి: యూటీఎఫ్

గండీడ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ నుంచి వెలువడుతున్న డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గంట శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, డైట్ కళాశాలలకు మెడికల్ గ్రౌండ్స్ పేరుతో కొందరు ఉపాధ్యాయులు జిల్లా వ్యాప్తంగా అక్రమ డిప్యుటేషన్ చేసుకోవడం సరికాదని తెలిపారు. కొంత మంది వారి స్వార్థంకోసం అనుకూలమైన స్థలాలకు సర్దుబాటు చేసుకొని అక్రమాలకు పాల్పడ్డారని, అనారోగ్యానికి గురైన టీచర్లకు మేలు చేయాల్సింది పోయి అక్రమార్కులకు బదిలీలు ఇస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు ఇంటర్నెట్

భూత్పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులమడుగు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం ఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌ను మంజూరు చేసింది. ఇందుకోసం ప్రభుత్వం ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి. ఇంతవరకు స్పందించకపోవడంతో వ్యాపారస్తుడు శ్రీనివాస్‌రావును గ్రామ యువకులు, ఉపాధ్యాయులు సంప్రదించగా వెంటనే స్పందించి పాఠశాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు యువకులు కలిసి సోమవారం ఆయనను సత్కరించారు.

9న మూఢనమ్మకాల నిర్మూలనపై సదస్సు

పాలమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాస్తిక సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో మూఢనమ్మకాల నిర్మూలనపై సదస్సు నిర్వహిస్తున్నట్లు నాస్తిక సమాజం సభ్యుడు చింతకింది జనార్దన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నాస్తిక సమాజంలో పనిచేసిన దివంగత అయ్యన్న యాదిలో సైన్స్‌పై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా నాసీర్, యం.చెన్నయ్య, విజయకుమార్, ప్రజాసంఘాల నాయకుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. దేవుడు, మహిమలు ఉన్నాయని నిరూపిస్తే రూ.10లక్షలు బహుమతిగా అందజేస్తామని సవాల్ చేశారు. బహిరంగ వేదికపై చర్చకు నాస్తిక సమాజం ప్రతినిధులను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రవేశాల ప్రక్రియ వెంటనే చేపట్టాలి: ఎన్ఎస్‌యూఐ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో లా కాలేజీలో 42 సీట్లకు సంబంధించిన ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు సోమవారం పీయూలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవేశాలు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని నష్టపోవాల్సి వస్తుందన్నారు. కౌన్సెలింగ్ కన్వీనర్‌తో చర్చించి వెంటనే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహ్మద్ సోహెల్, పృథ్వీనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, ఇమాద్ బైగ్, శ్రీను, విశాల్, అరఫత్, జహీర్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

సంతలో వసతులు కరువు

» తైబజారుతో పంచాయతీకి ఆదాయం

» ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, ప్రజలు



సంతలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

మిడ్జిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారాంతపు సంతలో వ్యాపారుల నుంచి తైబజార్ వసూలు చేస్తున్నా, ప్రాంగణంలో కనీస వసతులు లేకపోవడం వ్యాపారులు, కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రతీ గురువారం సంతలో వందలాది మంది రైతులు, చిరు వ్యాపారులు కూరగాయలు, పండ్లు, ధాన్యాలు విక్రయించడానికి వస్తుంటారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేస్తారు. అయితే తైబజార్ వసూలు చేస్తున్న రుసుము వినియోగంపై ఎటువంటి స్పష్టత లేకపోవడంతో వ్యాపారుల్లో ఆగ్రహం నెలకొంది. ప్రతీ వారం చెల్లిస్తున్న తైబజార్ డబ్బు ఎక్కడికి వెళ్తోందో ఎవరికీ తెలియదు. సంతలో ఎండ వచ్చినా నీడ లేకపోవడం, వర్షం పడ్డా మురుగులో నిలబడి, కూర్చుని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంత ప్రాంగణంలో నీటి సౌకర్యం, షెడ్లు, చెత్త తొలగింపు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక వసతులు లేవని, అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కనిపించడంలేదని పలువురు అంటున్నారు. సంత ప్రాంగణంలో తక్షణం మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, తైబజార్ వసూళ్లను పారదర్శకంగా వినియోగించాలని కోరుతున్నారు. మండలానికి ప్రధాన వ్యాపార కేంద్రం కావడంతో వసతులు మెరుగుపడితే వ్యాపారులకే కాక ప్రజలకు కూడా ఉపశమనం లభిస్తుందని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టేందుకు స్థలం లేకపోవడంతో పనులు చేపట్టలేదు. త్వరలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడుతాం.

- సాయన్న, పంచాయతీ కార్యదర్శి

పాఠశాలల్లో ఇంటర్‌నెట్ తప్పనిసరి

» ఎంఈవో మంజులాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మంజులాదేవి

జడ్చర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని, పాఠశాల గ్రాంట్స్ నుంచి రూ.వెయ్యి వినియోగించుకోవచ్చని ఎంఈవో మంజులాదేవి సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శిథిలావస్థ స్థితిలో ఉన్న తరగతి గదులను తొలగించాలని తెలిపారు. ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్‌వాలా అకాడమీ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. అపార్ వంద శాతం పూర్తి చేయాలని కోరారు. అనంతరం పాలమూరు ఎస్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో అందించిన చెస్ బోర్డులను ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



రామ్మోహన్‌ను అభినందిస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, అధ్యాపక బృందం

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడిగా పనిచేస్తున్న రామ్మోహన్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. అందుకు సంబంధించి సోమవారం ఓయూ పరీక్షల నిర్వహణ అధికారి ప్రకటించారు. ఈ పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు అభినందించారు. డాక్టర్ చంద్రకిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో లిఫ్టు ప్రారంభం



లిఫ్టును ప్రారంభిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన లిఫ్టును సోమవారం ఎస్పీ జానకి ప్రారంభించారు. హెటిరో ల్యాబ్స్, ఫార్ములేషన్స్ డైరెక్టర్ డా.వీఆర్ భాస్కర్‌రెడ్డి సహాయంతో సీఎస్ఆర్ నిధులు రూ.8.5 లక్షలతో లిఫ్టును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ముఖ్యంగా మహిళా సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం దీన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పోలీస్‌శాఖకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెటిరో ల్యాబ్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ ఫణిరాజకారణ్, ఫైనాన్స్ హెడ్ రవికిరణ్, అడిషినల్ ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, ఏఓ రుక్మీజీబాయి, ఆర్ఐలు పాల్గొన్నారు.

ఈ నెల 6,7న జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7న జిల్లా అండర్-14, 17 అథ్లెటిక్స్ బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. 6న అండర్-14, 7న అండర్-17 ఎంపికలు ఉంటాయని, స్కూల్ ఒరిజనల్ బోనఫైడ్, ఆధార్ కార్డుతో ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు.

317 డిప్యుటేషన్లకు 60 మంది దరఖాస్తు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయంలో 317 జీవోలో నష్టపోయిన ఉపాధ్యాయుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలువురికి ఇప్పటికే స్పౌజ్, మెడికల్, పరస్పర బదిలీల కింద సొంత జిల్లాకు పోస్టింగ్ గతేడాదిలో ఇచ్చారు. అప్పటికి మిగిలిపోయిన వారి కోసం 190 జీవో తీసుకొచ్చి వారి మూడేళ్ల పాటు సొంత జిల్లాలో పనిచేసిన వారికి డిప్యుటేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వారంతా గత పదిరోజులు కిందనే చివరి తేదీ ఉండడంతో దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ జిల్లా విద్యాశాఖ పూర్తిచేసే పని చివరి దశలో ఉంది. అయితే జిల్లాలో మొత్తం 60 మంది దరఖాస్తు చేసుకున్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 57 మంది ఉపాధ్యాయులు రంగారెడ్డి జిల్లాకు డిప్యుటేషన్‌పై వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారని, ముగ్గురు నారాయణపేటకు. మరి కొందరు నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ వెళ్లేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆయా జిల్లాలో ఉండే ఖాళీల ఆధారంగా మూడేళ్ల పాటు డిప్యుటేషన్ ఇవ్వనున్నారు.

మార్కెట్‌లో ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, నవంబరు 3 (ఆంధజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో పెద్ద హంస గరిష్ఠంగా రూ.1,750, కనిష్ఠంగా రూ.1,740, ఆర్ఎన్ఆర్ గరిష్ఠంగా రూ.2,146, కనిష్ఠంగా రూ.2,033, పెద్ద హంస 192, ఆర్ఎన్ఆర్ 1,781 క్వింటాళ్ల అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : షాద్‌నగర్‌లో ని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరిం చి, ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేయ్యాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.రవీందర్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం గురుకుల పాఠశాలను డీటీఎఫ్, తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ ప్రజాఫ్రంట్, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు సందర్శించి విద్యార్థులతో మా ట్లాడి సమస్యలు తెలుసుకున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలో 492 మంది విద్యార్థులు ఉంటే కేవలం ఏడు బాత్‌రూమ్‌లు మాత్రమే ఉన్నాయన్నారు. ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, అర్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో విద్యార్థినులు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 417వ జయంతి సందర్భంగా సోమవారం శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో పౌరాణిక నాటక ప్రదర్శన సోమవారం స్థానిక మునిసిపల్ టౌన్ హాల్‌లో నిర్వహించారు. వివిధ సంస్థలచే శాస్త్రీయ నృత్య ప్రదర్శన, బాలలచే స్వాతంత్ర్యం కావాలని లఘునాటిక ప్రదర్శన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కళాభిమానులు పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో సంబురాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ప్రపంచ మహిళా క్రికెట్ కప్ విజేతగా భారత జట్టు నిలవడంతో సోమవారం వాగ్దేవి కళాశాలలో సంబురాలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ విజేతవెంకటొరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు వీరవనితలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, కోట్ల శివకుమార్, నాగేందర్, సతీష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం



క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

» స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

» ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ మాట్లాడుతూ.. విద్యారంగంలో మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2023- 24లో రూ.2,100 కోట్లు, 2024-25లో రూ.2,100కోట్లు, 2025-26కు రూ.2,200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందన్నారు. ధర్నా వద్దకు వచ్చిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వారు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. శ్రీనాథ్, నందు, ప్రశాంత్, ఈశ్వర్, జహన్, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తమా నివారణకు ప్రసాదం

పాలమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తమా నివారణకు ఆర్య వైశ్య సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత ప్రసాదం ఈ నెల 5వ తేదీన అందిస్తున్నట్లు అధ్యక్షుడు రాజనరసింహ, బసవరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసకాలనీలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పోతులమడుగులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

» దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంతో పాటు పోతులమడుగు, తాటికొండలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పోతులమడుగులో మాజీ సర్పంచ్ హర్యానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన వారికి సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు, సామాన్య ప్రజలు పడరాని కష్టాలు పడ్డారని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఏవో మురళీధర్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్, భూపతిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, హర్యానాయక్, బోరింగ్ నర్సింహులు, సాయిలు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

దేవరకద్ర : మండలంలోని రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంతురెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగారం, చౌదర్‌పల్లి గ్రామాలల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

సంకలమద్దిలో ఎమ్మెల్యే పూజలు

మూసాపేట: జానంపేట, కొమిరెడ్డిపల్లి, అడ్డాకుల మండలం శాఖాపూర్, రాచాల గ్రామాల్లో సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు మండలంలోని సంకలమద్దిలో పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే బొడ్రాయి, నాగుల దేవత, పోచమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గికృష్ణయ్య, రామన్‌గౌడ్, నిరంజన్, నర్సింహారెడ్డి, అశోక్‌రెడ్డి, ఎం.నారాయణ, సిద్దు, జలేందర్ రెడ్డి, కోట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

» డీఈ చంద్రమౌళి



జడ్చర్లలో సమస్యలపై వినతిపత్రం అందచేస్తున్న కౌన్సిలర్ చైతన్యచౌహన్, స్థానికులు

జడ్చర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ శాఖ డీఈ కార్యాలయ ఆవరణలో సోమవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. సబ్ డివిజన్ డీఈ చంద్రమౌళి మాట్లాడుతూ.. వినియోగదారుల ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. మునిసిపాలిటీలోని 9వ వార్డులో నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్ చైతన్యచౌహన్ వినతిపత్రం అందచేశారు. కట్టెలను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌లైనును కొందరు ఏర్పాటు చేసుకుంటున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2వ వార్డులో లోటల్టేజీ సమస్య ఉందని, గుల్షన్‌నగర్, హనుమాన్‌వీధిలో సింగిల్ ఫేజ్ సరఫరాను త్రీఫేజ్‌గా పునరుద్ధరించాలని కౌన్సిలర్ బుక్కమహేష్ వినతిపత్రం అందజేశారు. ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్‌వి ఏర్పాటు చేయాలని కోరారు. ఏడీఈ చంద్రశేఖర్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి నిరంతరం కృషి



మునిమోక్షంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కోసం నిరంతరం ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వేపూర్, మునిమోక్షం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అదేవిధంగా వేపూర్ ఉన్నత పాఠశాలలో అక్షయ పాత్ర ఫౌండేషన్ అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అక్షయ పాత్ర సేవలు మరువలేనివని, పిల్లల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమలు ఎంతో ముఖ్యమన్నారు. రైతులు పండించిన సన్న వడ్లకు బోన ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిదే అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్యానాయక్, ఎంఈవో గోపాల్ నాయక్, మహేందర్, సిరాజ్‌ఖాద్రి, పెద్ద విజయ్, చెన్నయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, నవనీత, యాదయ్య పాల్గొన్నారు.

సమస్త శ్రేయస్సు ప్రసాదించాలి: ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : పాలమూరు నగర ప్రజలకు శివ మార్కండేయ స్వామి సమస్త శ్రేయస్సు ప్రసాదించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రార్థించారు. సోమవారం నగరంలోని పద్మావతి కాలనీ అయ్యప్ప కొండపై కొలువైన శివ మార్కండేయ స్వామి ఆరవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ది విజయ్ కుమార్, తిరుమల వెంకటేశ్, బాలరాజ్, దాసు వెంకటేశ్, సుకుమార్, పద్మనాభుడు పాల్గొన్నారు.

కేబుల్ కోసం గుంతలు.. ప్రజల ఇక్కట్లు



సిగ్నల్‌గడ్డ నుంచి పాతబస్టాండ్ వెళ్లే దారిలో కేబుల్ ఏర్పాటుకు తీసిన గుంతలు

జడ్చర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేబుల్ కోసం రోడ్డును పగలగొట్టి గుంతలు తీయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మునిసిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ నుంచి పాతబస్టాండ్ వెళ్లే దారిలో బీఎస్ఎన్ఎల్ కేబుల్ కోసం గుంతలు తీస్తున్నారు. ఉదయం వ్యాపారం సమయంలో గుంతలు తీయడంతో దుకాణంలోకి వెళ్లేందుకు వీలులేకుండ ఉందంటూ దుకాణాదారులు వాపోయారు. ఇదే విషయాన్ని స్థానిక కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి దృష్టికి వారు తీసుకెళ్లారు. ఎందుకు గుంతలు తీస్తున్నారని, అందుకు అనుమతి ఉందా అని కౌన్సిలర్ ప్రశ్నించారు. అనుమతి లేకుండా గుంతలు తీయడంతో ఇప్పటికే మిషన్‌భగీరథ పైపులు పగిలిపోవడం, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని చెప్పారు. కాంట్రాక్టర్‌పై మునిసిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలంటూ కౌన్సిలర్ కోరారు.